# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమ ఏర్పాట్లపై ఈరోజు సీనియర్ డెప్యూటి ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్షించారు.

- భారత్... ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పురోగమిస్తోందని బీజేపీ సీనియర్ నాయకలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- రాష్ట్రంలో ఆసుపత్రుల పనితీరు బాగుందని జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకృష్ణ గోయల్ అన్నారు.

- కేరళలో రుతుపవనాల ప్రారంభానికి పరిస్థితులు అనుకూలంగా మార్పు చెందుతున్నాయని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై భారత సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ నితీష్ వ్యాస్ ఈరోజు ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమ సమావేశం ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు, త్వరితగతిన కచ్చితమైన ఫలితాల విడుదల, శాంతి భద్రతల పరిరక్షణ, తదితర అంశాలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలను నితీష్ వ్యాస్ కి వివరించారు. రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, అదనపు డీజీ ఎస్. బాగ్చీ, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ తోపాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు వారివారి నియోజకవర్గాల నుండి ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్  అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించనుందని  బీజేపీ సీనియర్ నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మధురాపూర్‌లో ఈరోజు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఓటుతో కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి తీసుకురావడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశమూ నేడు భారత్‌ను గౌరవిస్తున్నాయని పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పురోగమిస్తోందన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు విశేషమైనవని బంగారు భారత నిర్మాణంలో రానున్న ఐదేళ్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని ప్రధాని ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా అధికారులంతా సిద్ధంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి అంశంపైనా పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఈ రోజు నిర్వహించిన శిక్షణ సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఓట్ల లెక్కింపు విధానంలో అనుసరించాల్సిన విధి విధానాలపై మార్గనిర్దేశం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యాయం కోసం  దీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారులకు నూతన నేర చట్టాల ద్వారా ఉపశమనం లభిస్తుందని తిరుపతికి చెందిన న్యాయవాదులు చెబుతున్నారు.  భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలు జులై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్నాయని తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాల స్థానంలో కొత్త చట్టాలను ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. పోలీసులు, న్యాయవ్యవస్థ కలిసికట్టుగా నూతన చట్టాలను పూర్తి స్థాయిలో అమలు పరిస్తే... న్యాయవ్యవస్థపై  ప్రజలకు మరింత విశ్వాసం కలుగుతుందని పలువురు న్యాయవాదుల తమ అభిప్రాయాన్ని ఆకాశవాణితో పంచుకున్నారు....

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం మన్యం జిల్లాలో కార్మిక శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా జూన్ 1వ తేది నుండి 30 వ తేది వరకు  బాల కార్మికుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సహాయ కమీషనర్ కె. రామకృష్ణ తెలిపారు. కార్మికశాఖ చట్టాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా బాలబాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే యాజమాన్యంపై బాల కార్మికుల చట్టం 1986 అనుసరించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రమాదకరమైన ప్రదేశాల్లో  18 సంవత్సరాలలోపు బాల బాలికలను, ప్రమాద రహిత ప్రదేశముల్లో 14 సంవత్సరాల వయస్సు లోబడిన పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని వివరించారు.  పార్వతీపురం మన్యం జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా మార్చడమే కార్మికశాఖ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఆసుపత్రుల పనితీరు బాగుందని జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకృష్ణ గోయల్ అన్నారు. చిత్తూరు జిల్లాలో రెండవరోజు పర్యటనలో భాగంగా ఈ ఉదయం ఆయన చిత్తూరు ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసి, సమస్యలను సత్వరం పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన పలువురు రోగుల బంధువులను కలిసి, ఆసుపత్రిలోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు నివారించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ఈ రోజు జిల్లా కలెక్టర్ ఎమ్.వేణుగోపాలరెడ్డి... తాడేపల్లి, కొల్లిపర మండలాల్లోని పలు ఇసుక రీచ్ లను తనిఖీ చేశారు. అక్కడి పర్యవేక్షణ బృందాలతో మాట్లాడి, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం ఇసుక రీచ్ లలో యంత్రాలతో తవ్వకాలు జరపరాదని, కూలీలతోనే తవ్వకాలు జరిపేలా పోలీస్, రెవెన్యూ, శాండ్ కమిటీల వారు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా ఇసుక తవ్వుతున్నట్లు ఫిర్యాదులు వస్తే, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల ఎన్.సి.సి డైరక్టరేట్ డిప్యూటీ డైరెక్టరేట్ జనరల్, ఎయిర్ కమాండర్ వి. ఎమ్. రెడ్డి ఈరోజు గుంటూరు జిల్లాలో పర్యటించారు. నంబూరు వివిఐటి కళాశాల లోని 10 వ బెటాలియన్ బాలికల వార్షిక శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇప్పటికే 70 యూనిట్ల ద్వారా శిబిరాలు నిర్వహిస్తున్నామని, త్వరలో ప్రతి జిల్లాలోనూ శిబిరాలు ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి శిబిరాలలో ప్రతిభ కనబరచిన కేడెట్లను... ఢిల్లీలో నిర్వహించే క్యాంపుకు ఎంపిక చేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా శిబిరంలో ప్రతిభ కనబరచిన కెడెట్లకు పురస్కారాలు అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తాంబరం నుంచి ఈరోజు ఉదయం 7 గంటల 15 నిమిషాలకు బయలుదేరాల్సిన తాంబరం సత్రగంజి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా మార్పు చేసినట్లు తెలిపాయి. అదేవిధంగా సత్రగంజిలో ఈరోజు మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు బయలుదేరాల్సిన సత్రగంజి సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజల సహకారంతో పశ్చిమ గోదావరి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయిందని పోలీస్ సూపరింటెండెంట్ అజిత వేజెండ్ల అన్నారు. ఈరోజు ఆమె నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం లోని బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆకాశవాణితో మాట్లాడుతూ... కౌంటింగ్ సందర్భంగా ప్రజలు, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే 24 గంటల్లో కేరళలో ఋతుపవనాల ప్రారంభానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. నైరుతి ఋతుపవనాలు... నైరుతి, మధ్య బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి అనుకూల వాతావరణం ఉన్నట్టుగా పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొని ఉంటుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 4 డిగ్రీలు క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్టు భారత వాతావరణ విభాగం అధికారి తెలియజేస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ ముఖ్య కార్యదర్శుల సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి అధికారులతో

సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్య కార్యదర్శుల సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత శాఖలు సకాలంలో చర్యలు తీసుకుని వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. భూమి, ఆస్తులు, విద్యుత్, తాగునీరు, వైద్య ఆరోగ్యం, విద్యా శాఖలకు సంబంధించి సమావేంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికను నీతి ఆయోగ్ కు సమర్పించాల్సి ఉంతుందని, కాబట్టి సంబంధిత శాఖలు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

==============================
==============================